క్లుప్తంగా

నేడు ఉచిత మెగా పశు వైద్య శిబిరం



ఎం.కృష్ణార్జున

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెంలో నేటి ఉదయం 9 గంటలకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత మెగా పశు వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు మండల పశు వైద్యాధికారి మేడిశెట్టి కృష్ణార్జున గురువారం విలేకరులకు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో చూడి పరీక్షలు, గర్భ కోశ వ్యాధులు, శస్త్ర చికిత్సలు, అధిక పాల దిగుబడి, గోమార్లు తదితర చికిత్సలు అందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పాడి రైతులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు రిటైర్డ్ ఎంప్లాయీస్ సమావేశం

కపిలేశ్వరపురం: రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మండపేట శాఖ సమావేశం శనివారం పట్టణంలోని రమా హిందూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు దేవళ్ళ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో రిటైర్డ్ ఎంప్లాయీస్‌కు లైఫ్ సర్టిఫికెట్లు జారీ, అడిషన్ క్వాంటమ్ తదితర అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు.

శాస్త్రీయ సాగు పద్ధతులు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు

కపిలేశ్వరపురం: వరి సాగులో శాస్త్రీయ పద్ధతులు అనుసరించేలా రైతులకు అవగాహన కల్పించాలని మండలంలోని వడ్లమూరు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మండల సాగు సలహామండలి సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి అన్నారు. మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రబీ సాగు ప్రణాళిక అమలుపై అవగాహన కల్పించారు. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు మంజూరు, పీఎం కిసాన్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్బీకేల ద్వారా ఎరువులు, పురుగు మందుల విక్రయాలపై ఏఓ రమేష్‌కుమార్ వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పలివెల మధు, మండలి సభ్యులు నక్కా సింహాచలం పాల్గొన్నారు.

12న కపిలేశ్వరపురం మండల సమావేశం

కపిలేశ్వరపురం: మండపేట మండల పరిషత్ సర్వసభ సమావేశాన్ని ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ శ్రీదేవి శుక్రవారం తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశంలో అభివృద్ధి పనుల పూర్తి వివరాలతో ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

వేంకటేశ్వరస్వామికి జన్మ నక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలు చేశారు. ఆలయ అర్చక బృందం సభ్యులు స్వామిని విశేషంగా అలంకరించారు. తెల్లవారుజామున పంచామృతాభిషేకం చేశారు. అంగర, పడమర ఖండ్రిక, టేకి, తాతపూడి, వెదురుమూడి గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

ముందుగా గుర్తిస్తే కుష్ఠు నిర్మూలన సులభం



అంగరలో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీఎంఓ వెంకటేశ్వరరావు

కపిలేశ్వరపురం: లక్షణాలను ముందే గుర్తిస్తే కుష్ఠు వ్యాధిని సమూలంగా నిర్మూలించవచ్చని డీపీఎంఓ కె.వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అంగర గ్రామంలోని శ్రీసిద్ధార్థ కళాశాలలో శుక్రవారం స్పర్శ పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చర్మంపై కుష్ఠు వ్యాధి మచ్చలను గుర్తిస్తే వెంటనే పీహెచ్‌సీ వైద్యాధికారిని సంప్రదించాలన్నారు. అంగర పీహెచ్‌సీ లెప్రసీ విభాగం నోడల్ పర్సన్ వెన్నేటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జనవరి 30 ప్రారంభమైన స్పర్శ అవగాహన కార్యక్రమం ఈ నెల 17 వరకూ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అంగర పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు పట్టాభిషేకం

- శరవేగంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్
- శాశ్వత హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు
- రెవెన్యూ డివిజన్ పరిధిలో 17,419 లబ్ధిదారులు



సోమేశ్వరంలో హౌసింగ్ కాలనీ



సచివాలయంలో నిర్వహిస్తున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

రాయవరం: పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా నివేశన స్థలాలను మంజూరు చేసింది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అర్హులందరికీ ఇళ్ల పట్టాలు అందజేసింది. ఇళ్లు నిర్మించుకునేందుకు ఆర్థికంగా సాయపడింది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలతో కొత్తగా ఊళ్లు ఏర్పడ్డాయి. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేసింది. అంతటితో ఆగకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ఇళ్ల స్థలాలు ఇచ్చిన అక్క చెల్లెమ్మలకు స్థలాలపై సర్వ హక్కులూ కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేసేందుకు నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. వార్డు/పంచాయతీ కార్యదర్శులను జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్న ప్రభుత్వం ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లకు పచ్చజెండా ఊపింది.

వీఆర్వోలు, అడ్మిన్లకు బాధ్యతలు

రామచంద్రపురం, మండపేట పట్టణాల పరిధిలోని సచివాలయలతో పాటుగా, క్లస్టర్ పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం మండలాల పరిధిలోని సచివాలయాల్లో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. లబ్ధిదారులను మ్యాపింగ్ చేసి, ఇళ్ల స్థలాలకు బౌండరీలను ఫిక్స్ చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. సచివాలయాల్లో అడ్మిన్, వీఆర్వోలు రిజిస్ట్రేషన్లను వేగవంతం చేసేలా చర్యలు తీసుకున్నారు.

పేదలందరికీ ఇళ్లు మండలాల వారీగా లక్ష్యమిదీ

మండలం	లక్ష్యం	ఇప్పటి వరకు చేసిన రిజిస్ట్రేషన్
మండపేట	5,354	194
రాయవరం	2,167	926
రామచంద్రపురం	6,271	2,779
కె.గంగవరం	2,072	1,036
కపిలేశ్వరపురం	1,555	860

ప్రత్యేకాదికారుల నియామకం

లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రత్యేకాధికారుల నియామకాన్ని కూడా చేపట్టారు. మున్సిపాలిటీల్లో నగర పాలకసంస్థ కమిషన్లు, మండల స్థాయిలో ఎంపీడీవో, తహసీల్దార్లను ప్రత్యేకాధికారులుగా నియమించారు. వారు ఎప్పటికప్పుడు సచివాలయాలకు వెళ్లి సిబ్బంది పనితీరుపై ఆరా తీస్తున్నారు. అలాగే ఇప్పటి వరకూ ఉన్న పలు అడ్డంకులను కూడా ప్రభుత్వం సరి చేసింది. గతంలో డేటా ఎంట్రీ సమయంలో పొరపాటుగా నమోదైన ప్లాట్ సైజులు, ప్లాట్ నంబరు, స్థలం విస్తీర్ణం, ఆధార్ నంబర్లు, ఇంటి పేర్లు, భర్త పేరు తదితర విషయాలను సవరించే అవకాశం ఉండడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతమైంది.

రెవెన్యూ డివిజన్ పరిధిలో పరిస్థితి ఇదీ

రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో మండపేట, రామచంద్రపురం మున్సిపాలిటీలతో పాటుగా, రామచంద్రపురం, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో 17,419 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకూ 5,795 మందికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. మిగిలిన వారికి త్వరితగతిన పూర్తి చేసేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపడుతున్నారు. రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు అయినప్పటికీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగించనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

లబ్ధిదారులకు అసౌకర్యం కలగకుండా



సాధారణంగా రిజిస్ట్రేషన్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చేపడతారు. అయితే ప్రభుత్వం లబ్ధిదారులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకే ఆయా గ్రామాల్లో సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపడుతోంది. ఇది లబ్ధిదారులకు ఒక చక్కటి అవకాశం. ఇంటిపై హక్కును కల్పించడంతో పాటుగా, ఉచితంగా రిజిస్ట్రేషన్ చేపడుతోంది.

– ఆర్‌వీ కృష్ణారావు, తహసీల్దార్, రాయవరం

త్వరగా రిజిస్ట్రేషన్ పూర్తి



రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. లబ్ధిదారుల ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా చేపడుతున్నాం. సాధ్యమైనంత త్వరగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపడుతున్నందున వారికి ప్రభుత్వం ఇబ్బందులు తొలగించింది.

– ఎస్. సుధాసాగర్, ఆర్డీవో, రామచంద్రపురం

రానున్న ధర్మయుద్ధంలో వైఎస్సార్ సీపీదే గెలుపు



తనుమళ్లలో వైఎస్సార్ సీపీ నాయకులతో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్ చంద్రబోస్

రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్

కాజులూరు: రానున్న ధర్మయుద్ధంలో మరోసారి వైఎస్సార్ సీపీ గెలుపొందడం ఖాయమని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్‌చంద్రబోస్ అన్నారు. శుక్రవారం మండలంలోని తనుమళ్ళ, పెనుమళ్ళ, జగన్నాథగిరి తర్లంపూడి తదితర గ్రామాల్లో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాస్‌చంద్రబోస్ పర్యటించి నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. పేద మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరించి ప్రభుత్వ పథకాలు వారికి సక్రమంగా అందుతున్నది లేనిది ఆరా తీశారు. ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ పేదవాడు కూడు, గూడు, నీడలకు లోటు లేకుండా హాయిగా బతకాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ఆ దిశగా స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రజా సంక్షేమానికి అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంచి పథకాలను రూపొందించడమే కాకుండా దళారుల ప్రమేయం లేకుండా నేరుగా వాటిని లబ్ధిదారులకు అందజేయటంలోనూ సఫలీకృతులయ్యారన్నారు. వలంటీర్ వ్యవస్థ అందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. గతంలో ప్రతి చిన్న పనికి జిల్లా కలెక్టరేట్, మండల పరిషత్ తదితర కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని జగనన్న సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి అన్ని శాఖల అధికారులను స్థానికంగానే అందుబాటులోకి తీసుకవచ్చారన్నారు. గతంలో అర్హులకు పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల సిఫారసులు ఉండాల్సి వచ్చేదన్నారు. జన్మభూమి కమిటీల రూపంలో ఉన్న దళారులు ముడుపులు తీసుకుని వారికి నచ్చిన వారికే పథకాలు ఎంపిక చేసేవారన్నారు. జగనన్న పాలనలో పథకాలన్ని పారదర్శకంగా నిజమైన అర్హులకే అందుతున్నాయన్నారు. ఇంత చక్కటి పాలన నిరంతరం అందాలంటే రాష్ట్రానికి జగనే మరలా సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, మురళి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, మండలంలోని 26 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చించేందుకు సిద్ధమా?

- ప్రైవేట్ సంస్థ పర్యవేక్షణలో ముందస్తు ఎన్నికల్లో తలపడదామా?
- ఎమ్మెల్యే వేగుళ్లకు ఎమ్మెల్సీ తోట సవాల్




మండపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధిపై చర్చించేందుకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సిద్ధమా? అని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సవాల్ విసిరారు. మండపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేశామని, ఎక్కడైనా అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే వేగుళ్ళ నిరూపించగలరా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపైనా, తనపైనా ఎమ్మెల్యే వేగుళ్ల పదే పదే ఆరోపణలు చేస్తుండడంపై శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట ఘాటుగా స్పందించారు. టీడీపీ హయాంలో ప్రజలకు మేలు చేసిందేమీ లేకపోవడంతో ఎమ్మెల్యే వేగుళ్ల తనపై వ్యక్తిగత ఆరోపణలకు దిగుతున్నారన్నారు. కేశవరంలో తాను అక్రమాలకు పాల్పడుతున్నానంటూ పదే పదే ఆరోపిస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే వేగుళ్లకు స్పష్టమైన సవాల్ విసిరారు. కేశవరం సర్పంచ్‌తో సహా ప్రజలు తమ గ్రామంలో చేపట్టిన అభివృద్ధిని చూపిస్తాం రమ్మని పిలుస్తుంటే ఎమ్మెల్యే వేగుళ్ల స్పందించడం లేదన్నారు. గ్రామంలోకి వెళ్లి ఎవరేమి పనులు చేశారో చెప్పుకుందామని ఎవరిని ఆదరిస్తారో, ఎవరిని రాళ్లతో కొడతారో చూద్దామా అని ఎమ్మెల్యే వేగుళ్ళకు సవాల్ విసిరారు. తాను అవినీతికి పాల్పడుతున్నానంటూ చెబుతున్న గ్రామమైన కేశవరంలో ప్రైవేట్ సంస్థ పర్యవేక్షణలో సాధారణ ఎన్నికలకు ముందస్తుగా ముఖాముఖి ఎన్నికలను ఎదుర్కొనేందుకు ఎమ్మెల్యే వేగుళ్ల సిద్ధమా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో తన హయాంలో చేసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ తోట వివరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, ఎంపీపీ ఉండమట్ల వాసు, జెడ్పీటీసీ సభ్యురాలు కురుపూడి భవాని, కాపు సంఘం అధ్యక్షులు జిన్నూరి సాయిబాబా,నాయకులు పోతంశెట్టి ప్రసాద్, ముమ్మిడివరపు బాపిరాజు, పెంకే గంగాధర్, చోడే శ్రీకృష్ణ పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించాలి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- మాచవరంలో గడప గడపకూ..



మాచవరంలోని ఓ ఇంటి వద్ద సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: సమాజంలోని అన్ని వర్గాల వారికీ మేలు చేసింది ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమే అని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని మాచవరంలో శుక్రవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉప సర్పంచ్ పడాల వసంత్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు పలివెల శోభన తదితరులతో కలిసి ఆయన గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. గ్రామంలోని దేవుడి కాలనీ, బోడిలింగం వీధి, సూర్యలక్ష్మీ థియేటర్ వీధి, రెడ్డికృష్ణమ్మపేటల్లో ఎమ్మెల్సీ త్రిమూర్తులు పర్యటించి, ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను ఆయన గడప గడపకూ వెళ్లి అందించారు. ఆయన వెంట మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, పార్టీ సేవాదళ్ మండల కన్వీనర్ వెలగల సత్యనారాయణరెడ్డి, పారిశ్రామికవేత్త సబ్బెళ్ల కాశీ ఈశ్వరరెడ్డి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లిడి రామారెడ్డి, పలువురు పార్టీ నేతలు, వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

17లోపు ఈ–క్రాప్ పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బత్తుల అప్పారావు

కె.గంగవరం: ప్రతి రైతు ఈ నెల 17వ తేదీలోపు ఈ–క్రాప్ బుకింగ్ పూర్తి చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బత్తుల అప్పారావు అన్నారు. మండల కేంద్రమైన కె.గంగవరంలో శుక్రవారం మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. మండల సలహా మండలి అధ్యక్షుడు ఇళ్ల సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోవడం వల్ల రైతులు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సదుపాయాలు అందుతాయన్నారు. ఇప్పటికే గ్రామాల్లో వ్యవసాయ సహాయకులు ఈ–క్రాప్ బుకింగ్ చేస్తున్నారని వారికి రైతులు సహకరించాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేసిందని రైతు భరోసా ద్వారా ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు సకాలంలో విత్తనాలు ఎరువులు అందిస్తుందన్నారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్దకే సేవలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సబ్సిడీపై ట్రాక్టర్లను అందించడంతో పాటు యాంత్రీకరణకు అవసరమైన యంత్రాలను కూడా అందిస్తున్నారన్నారు. రైతులకు ఏ సహాయం కావాలన్నా ఆర్‌బీకే కేంద్రాల వద్దకు వెళ్లి సమాచారం అందించాలని లేదా వ్యవసాయ సలహా మండలి సభ్యుల సహకారం తీసుకోవాలని సూచించారు. ఈ పంటకు సాగునీరు సరఫరాలో ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని సూచించారు. ఏఓ బలుసు రవి, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాపిరెడ్డి శ్రీనివాస్‌కు సత్కారం



పదోన్నతిపై వెళ్తున్న సాపిరెడ్డి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

రామచంద్రపురం రూరల్: జిల్లా కేంద్ర సహకారం బ్యాంకులో సుదీర్ఘకాలం రామచంద్రపురం బ్రాంచ్ మేనేజర్‌గా, ద్రాక్షారామ, అంగర బ్రాంచ్‌ల మేనేజర్‌గా పనిచేసి జిల్లా కేంద్ర సహకారం బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా వెళ్తున్న సాపిరెడ్డి శ్రీనివాస్‌ను సహకారం బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించారు. ద్రాక్షారామ బ్రాంచ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ శ్రీనివాస్ తను పనిచేసిన బ్రాంచ్‌లలో సహకార సంఘాల అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారన్నారు. అదే విధంగా ద్రాక్షారామ బ్రాంచ్ నోడల్ ఆఫీసర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జి.సూర్యారావుకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ద్రాక్షారామ బ్రాంచ్ మేనేజర్ అరిగెల అంబికాదేవి, సూపర్‌వైజర్ సీహెచ్ గోవిందరావు, సహకార సంఘాల సీఈఓలు పెంకే సత్యనారాయణ, జి.సూర్యనారాయణచౌదరి, పుల్లెల రామమూర్తి, పెన్నాడ సాయి, కె.మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ సంతోషమ్మ

రామచంద్రపురం రూరల్: మండలంలోని చోడవరం మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మండల విద్యాశాఖాధికారులు మానుపూడి శ్రీనివాస్, వాసంశెట్టి నాగేశ్వరిలు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి, గోరుముద్ద, జగనన్న విద్యాకానుక, నాడు–నేడు పథకాల ద్వారా పేదలైన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందుతోందన్నారు. విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పలు పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు సర్పంచ్ నేదునూరి సంతోషమ్మ, ఎంపీటీసీ సాదే సుభద్ర, స్థానిక పారిశ్రామికవేత్త ఫణి, గ్రామ పెద్దల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.కమల ఫ్లోరెన్స్, ఉపాధ్యాయులు పి.సుధాకర్ బాపూజీ, ఎం.అమృతరావు, కృపారాజు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది మద్యం బాటిళ్ల స్వాధీనం

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురం ఓ వ్యక్తి వద్ద తొమ్మిది అక్రమ మద్యం బాటిళ్లను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్సై బి.రాజేష్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కె.జగన్నాథపురం గ్రామానికి చెందిన నల్ల తాతారావు వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు గుర్తించారు. అతని నుంచి తొమ్మిది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వైద్యానికి రూ.6 లక్షల సాయం



మండపేటలో లబ్ధిదారునికి రూ.ఆరు లక్షల చెక్ అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర గ్రామానికి చెందిన వంగా భాస్కరరావు గొంతు సంబంధిత సమస్యతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స భారమైన నేపథ్యంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును బాధిత కుటుంబ సభ్యులు ఆశ్రయించారు. స్పందించిన ఎమ్మెల్సీ తోట రూ. ఆరు లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను మంజూరు చేయించారు. సంబంధిత చెక్‌ను శుక్రవారం మండపేటలోని ఎమ్మెల్సీ తోట క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్సీ తోట కృషికి కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ కపిలేశ్వరపురం మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

పీవీకి భారతరత్నపై హర్షం

కపిలేశ్వరపురం (మండపేట): మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడంపై మండపేట పట్టణ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తొలిసారి తెలుగు ప్రాంతానికి చెందిన పీవీ నరసింహారావును ఆ అవార్డుకు ఎంపిక చేయడం గర్వించతగినదని సంఘం నాయకులు శివకోటి శేష సుబ్రహ్మణ్యం, జీఎస్ భగవాన్, ఏడిద సూర్యనారాయణ, కొండూరి భాస్కర రామరాజు, అయ్యంగారి విశ్వేశ్వరరావు అన్నారు. బహుభాషా కోవిదుడిగానూ, ప్రధానిగానూ, ఆర్థిక రంగ నిపుణుడిగానూ పీవీ నరసింహారావు యావత్ భారత దేశానికి ఖ్యాతిని ఆర్జించారని నాయకులు కొనియాడారు.

సురక్షతో పేదల ఆరోగ్యానికి రక్ష



కేదారిలంకలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కపిలేశ్వరపురం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్య పరిరక్షణ సాధ్యపడుతుందని మండలంలోని కేదారిలంకలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న వక్తలన్నారు. శిబిరాన్ని మండపేట నియోజకవర్గ సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు వీధి వెంకటరెడ్డి ప్రారంభించారు. వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్ మాట్లాడుతూ లంక గ్రామాల ప్రజలకు సురక్ష వైద్య శిబిరాలు ప్రయోజనకరమన్నారు. శిబిరంలో వానపల్లి పీహెచ్‌సీ వైద్యులు, ప్రత్యేక నిపుణులు రక్తం, బీపీ, షుగరు, ఈసీజీ తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులిచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

జగన్నాయకులపాలెంలో 361 మందికి వైద్యం

రామచంద్రపురం రూరల్: మండలంలోని జగన్నాయకులపాలెంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, ఆదివారపుపేట సర్పంచ్ నక్కిన దొరబాబు, ఎంపీటీసీ బళ్ల సుధాకరరావులతో కలసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు ఎస్.ప్రశాంతి, సుశీల, సౌమ్యలు, కంటి వైద్య నిపుణుడు కోటేశ్వరరావులు 361 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీ రామచంద్రమూర్తి, ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, పంచాయతీ కార్యదర్శి ప్రసాదరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



వెల్ల ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు మాత్రలు వేస్తున్న డాక్టర్ అలేఖ్య

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అలేఖ్య ఆధ్వర్యంలో గురువారం చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. నేషనల్ డీ వార్మింగ్ డే ను పురస్కరించుకుని పీహెచ్‌సీ పరిధిలోని ఒకటి నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారికి మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో ఈ వయస్సు వారు 2672 మంది ఉండగా 2626 మందికి మాత్రల పంపిణీ జరిగినట్లు డాక్టర్ అలేఖ్య విలేకరులకు తెలిపారు. ఈ నెల 16 లోపు మిగిలిన వారికి కూడా మాత్రలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె.శ్రీనివాస్, ఈశ్వరమ్మ, డి.రాజేశ్వరి, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల ఆందోళన

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆశ కార్యకర్తలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. తమ డిమాండ్ల సాధనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న నిరసన కార్యక్రమాలను పోలీసులు అడ్డుకోవడాన్ని ఆశ కార్యకర్తల సంఘం నాయకులు తప్పుబట్టారు.